ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



పల్నాడు జిల్లా నరసరావుపేటలో టిడిపి ప్రదర్శన



గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో సిపిఎం అభ్యర్థి రోడ్‌షో



సభకు హాజరైనవారితో సెల్ఫీ దిగుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

గప్‌చుప్!

- ముగిసిన ప్రచారం
- మూగవోయిన మైకులు
- పోటాపోటీగా నగదు, మద్యం పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. ప్రచారం చివరి రోజు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సిఎం జగన్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. అంతేగాక రెండు జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లోనూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబూ ఇదే తరహాలో నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రచారంలో పాల్గొన్నారు. ఇండియా బ్లాక్ తరుపున గుంటూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విజయం కోసం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీతారాం ఏచూరి, కె.రామకృష్ణ ప్రచారంలో పాల్గొన్నారు. ఇండియా బ్లాక్ తరుపున వామపక్షాలు, కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున పిసిసి అధ్యక్షురాలు షర్మిల పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ప్రచారం చేశారు. టిడిపి, జనసేన అభ్యర్థుల తరుపున పవన్ కల్యాణ్ ప్రచారం చేశారు. చెదురుమదురు ఘటనలు మినహా ప్రచార పర్వం ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. ప్రచారంలో పల్నాడు జిల్లాల్లో జరిగిన కొన్ని ఘర్షణలు, దాడులకు సంబంధించి పోలీసులు ఎప్పటికప్పుడు ఫిర్యాదులపై స్పందించి చర్యలు తీసుకున్నారు.

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు తుది విడతగా ప్రచారం చేసి సాయంత్రం ఆరు గంటలకు ముగించారు. ప్రచారం ముగిసిన వెంటనే అభ్యర్థుల తరుపున వారి అనుచరులు ఇళ్లకు వెళ్లి ఓటర్లను ఆకట్టుకునేందుకు వీలుగా భారీగా నగదు, మద్యం పంపిణీ చేపట్టారు. ప్రతి

▶ 2లో

బాబు మేనిఫెస్టోను అమలు చేయరు

సిఎం జగన్ - హామీలు లేకుండా చిలకలూరిపేటలో సభలో ప్రసంగం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి అధినేతచంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఏ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవని వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కళామందిర్ సెంటర్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమస్యలపై కానీ నియోజకవర్గం భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనులపై హామీలేమీ లేకుండానే ఆయన ప్రసంగాన్ని ముగించారు. చంద్రబాబుపై విమర్శలు, తాను గత ఐదేళ్లలో చేపట్టిన పథకాలను మాత్రమే ప్రస్తావించారు. తాను 132 సార్లు బటన్ నొక్కటం ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా అక్క చెల్లెమ్మలు, అన్న తమ్ముల ఖాతాలకు చెల్లింపులు జరిగాయన్నారు. ఈ విషయాన్ని నేను ఇక్కడే ఉన్నా వేలమంది నా అక్కచెల్లెల్లు, అన్న దమ్ములను అడుగుతున్నా.. ఈ 59 నెలల్లో చెప్పిన మాటను చెప్పినట్లే మేనిఫెస్టోలోని అంశాలను 99 శాతం అమలు చేశాం అని అన్నారు. ఈ ప్రభుత్వం చేసిన విధంగా గతంలో ఏ ప్రభుత్వమైనా చేయగలిగిందా అని అడిగారు. విశ్వసనీయతకు అర్థం తెలిపిన నాయకుడు మీ జగనన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చంద్రబాబు అవాస్తవాలు చెబుతున్నారని విమర్శించారు. 2014లో చంద్రబాబు అమలు చేస్తానన్న మేనిఫెస్టో చెత్తబుట్టలో వేశారన్నారు. రైతులకు రుణమాఫీ

▶ 2లో

ఇళ్ల పట్టాలిప్పించాలని జొన్నాకు పేదల వినతి

- నాలుగు దశాబ్దాల నిరీక్షణ - నేతలు మారినా తలరాతలు మారలేదంటున్న కాలనీ వాసులు
- సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు బాపనయ్యనగర్ ప్రజల వినతి

వార్త సెంటర్ స్ప్రెడ్‌లో

విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి

ప్రజాశక్తి-ఈపూరు

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి యువరైతు మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీనగర్‌లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన వేంపాటి పరమేశ్వరరెడ్డి (28) వ్యవసాయ బోరు మోటార్ కింద పొలం సాగు చేస్తున్నాడు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఫీజులు వేసే క్రమంలో పైన ఉన్న 11 కె.వి విద్యుత్తు లైన్ తగిలి కింద పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై మృతుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వేంపాటి పరమేశ్వరరెడ్డి మృతదేహం

ప్రచారానికి తెర... ప్రలోభాలకు ఎర...

వినూత్న పద్ధతుల్లో డబ్బు పంపిణీ - ఓటరు స్లిప్పుల్లో క్యూఆర్ కోడ్

వార్త సెంటర్ స్ప్రెడ్‌లో

రేపటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- నేడు ఈవిఎం, సామగ్రితో తరలివెళ్లనున్న సిబ్బంది
- ప్రతిఒక్కరూ ఓటేయాలని కలెక్టర్, ఎస్‌పి విజ్ఞప్తి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుండి ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని గుంటూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికలాధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం కలక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో ఎస్పీ తుషార్ దూడితో కలసి కలెక్టర్ మీడియాతో పోలింగ్ ఏర్పాట్లపై వివరించారు. ఎన్నికల ప్రచారం 6 గంటలకు ముగిసిందని, మద్యం షాపులను మూయించడంతో పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. ఇకపై ప్రచారాలేమీ నిర్వహించకూడదన్నారు. గుంటూరు జిల్లాలో 17,91,543 మంది ఓటర్లున్నారని, వీరికోసం 1,915 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 30 మంది అభ్యర్థులు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 132 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి 2,300 మంది పీవోలు, 2,300 మంది ఏపీవోలు, 9,800 మంది ఓపీవోలను నియమంచామన్నారు. పోలింగ్ అధికారులకు ఆదివారం సంబంధిత నియోజకవర్గంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కేటాయించి పోలింగ్ స్టేషన్ ఉత్తర్వులను అందిస్తారన్నారు.

▶ 2లో

పోలింగ్ నిర్వహణకు సహకరించండి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శనివారం సాయంత్రం నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసిన మరుసటి రోజైన మంగళవారం సాయంత్రం వరకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికలాధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంపులుగా ఉండరాదని, వివాదాలకు పాల్పడొద్దని కోరారు. ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమ్మికూడొద్దని, ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు.

సెల్‌ఫోన్‌కు అనుమతి లేదు

పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను అనుమతించబోరని జిల్లా ఎన్నికలాధికారి తెలిపారు.

▶ 2లో

ఎన్నికల ప్రచారం ముగిసింది

రిటర్నింగ్ అధికారి జెసి శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో 144వ సెక్షన్ అమల్లోకి వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం సెక్టార్ ఆఫీసర్స్‌తో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 299 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు.

'బిజెపికి ఓటు వేస్తే రిజర్వేషన్లు వద్దనుకున్నట్టే'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కూటమికి ఓటు వేస్తే ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లను వద్దనుకున్నట్లేనని వైసిపి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు విజ్ఞప్తి అన్నారు. సత్తెనపల్లి వైసిపి కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్,అంబటి రాంబాబు లు ముస్లిం మైనార్టీల తో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం అంబటి విలేకరులతో రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినా కూటమికి వేసినట్లేనని వివరించారు. చంద్రబాబుకి , తెలుగుదేశం పార్టీకి ఇవే చివరి ఎన్నికలు అని అన్నారు. గత మెజారిటీ కన్నా ఒక్క ఓటు తగ్గినా తనది నైతిక పరాజయమేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తున్న కూటమికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నామని, కూటమి ఓటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు.

రెచ్చగొడుతున్నారు.. ప్రత్యేక బలగాలు పంపండి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

విమర్శలతో రెచ్చగొట్టి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగకుండా గొడవలు సష్టించేందుకు ప్రతిపక్ష నేతలు ప్రయత్నిస్తున్నారని బలగాలను దింపి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కి తాను లేక రాస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సజావుగా జరగాలంటే ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

సమగ్ర వికాసానికి విద్య

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్.కె.కృపాసాగర్

ప్రజాశక్తి-గుంటూరు

మనిషి సమగ్ర వికాసానికి విద్య మాత్రమే దోహదం చేస్తుందన్న స్పృహతో 56 సంవత్సరాల క్రితం జాగర్లమూడి కుప్ప స్వామి స్ఫూర్తితో నెలకొల్పిన జెకెసి కళాశాల ఖ్యాతి ఖండాంతరాలకు విస్తరించటం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్.కె. కృపాసాగర్ అన్నారు. శనివారం కళాశాల 56వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, కళాశాల పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడారు.

పోలింగ్ నిర్వహణకు సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో 1929 పోలింగ్ కేంద్రాలుండగా వీటిల్లో 557 సమస్యాత్మకమని, వీటి వద్ద మరింత పటిష్టంగా బందోబస్తు ఉంటుందని చెప్పారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకుంటామని, సాంకేతిక సమస్యలు, ఇతర వివాదాలేమీ తలెత్తకుండా, రీపోలింగ్‌కు అవకాశం లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాతంగా ముగించడమే తమ లక్ష్యమన్నారు. జిల్లాకు 18 కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారులకు సెక్టార్ అధికారుల ఫోన్ నంబర్లు, క్విక్ రెస్పాన్స్ టీముల ఫోన్ నంబర్లు, అవసరమైన వారి ఫోన్ నంబర్‌లు అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ అధికారి సాయంత్రం 5.55 గంటలకు పోలింగ్ కేంద్రం బయటకు రావాలని, 6 గంటలకు గేట్లు మూసేయాలని, ఈ ప్రక్రియను వీడియో చిత్రీకరణ ఉంటుందని చెప్పారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికలకు సంబంధించి నిర్దేశిత నివేదికలు అన్ని సకాలంలో అందజేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ లోతేటి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వహించాలని 14 వ తేదీ మధ్యాహ్నం వరకు సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది అందరి దగ్గర నియోజకవర్గానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని, విధులు నిర్వహిస్తున్న ఆర్ ఓ పోలీసు సిబ్బందితో వారి వివరాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.. వెబ్ కాస్టింగ్ కు సంబంధించి నియోజకవర్గానికి ఒకరు ఎన్నికల రోజున సాయంత్రం 7:00 గంటల వరకు నిఘా ఉంచాలని సూచించారు. మీడియా కంట్రోల్ రూమ్ నుండి ఎప్పటికప్పుడు టీవీలలో ప్రసారమవుతున్న ప్రతికూల వార్తలను స్క్రీన్ షాట్ తీసి సంబంధిత కంట్రోల్ రూమ్ కు అందించాలన్నారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

ఏమైనా సమస్యలు ఉంటే కాల్ చేయండి

మైక్రో అబ్జర్వర్లు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లనుపరిశీలిస్తూ సంబంధిత నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు పొందుపరచాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు భూరేశ్వర నరేంద్ర, శ్రీహరి ప్రతాప్ షాహి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి, గురజాల, మాచర్ల ,పెదకూరపాడు నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులుగా నియమితు లైన బూరె సర్వేశ్వర నరేంద్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్ సమయంలో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే 91546 90367 నంబర్‌కు కాల్ చేసి వివరించాలని తెలిపారు. అదేవిధంగా నరసరావుపేట ,వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గా లకు సాధారణ పరిశీలకులను నియమిత ులైన శ్రీహరి ప్రతాప్ షాహి మాట్లాడుతూ ఫామ్ -28 ను అందజేసి దానిపై అవ గాహన కల్పించాలన్నారు. పోలింగ్ సమ యంలో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే 91546 90375 కి కాల్ చేసి వివరించాలని సూచించారు.

మూడవ ర్యాండమైజేషన్ పూర్తి

ఎన్నికల సిబ్బందికి 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు భూరేశ్వర నరేంద్ర, శ్రీహరి



మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్, పక్కన ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్‌ఒ వినాయకం

ప్రతాప్ షాహీ, సమక్షంలో స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల పిఒ, ఎపిఒ,ఒపిఒలు, సూక్ష్మ పరిశీలకులకు మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించి రీపోలింగ్ ప్రక్రియ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతి అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గప్‌చుప్!

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో టిడిపి, వైసిపి పోటాపోటీగా డబ్బు పంపిణీలో నిమగ్నమయ్యారు. కరెన్సీ పంపిణీకి తమ సొంత మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. కార్పొరేట్ సంస్థలకు చెందిన నేతలు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఆయా పార్టీ కార్యకర్తలతో పాటు ఆయా సంస్థల ఉద్యోగులనూ ఉపయోగిస్తున్నారు. పోలీసులు నిర్వహించిన దాడిలో పలుచోట్ల మద్యం, సొమ్ము స్వాధీనం చేసుకుంటున్నారు. నియోజకవర్గాల్లో వివిధ సామాజిక తరగతుల నాయకుల ద్వారా ఈ పంపిణీని ప్రారంభించారు. కొంతమంది అభ్యర్థులు ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఓటుకు రూ.3 వేల వరకు ఇస్తున్నారని తెలిసింది. పెదకూరపాడులో రెండు పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం ఓటుకు రూ.5 వేల వరకు ఇస్తున్నారు. రెండురోజుల క్రితం పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం రూ.7 వేల వరకు ఇచ్చారని సమాచారం. గురజాలలో ఒక మాజీమంత్రి సూచన మేరకు ఇరువురు నేతలు రాజీకి వచ్చి ఓటుకు రూ.1500 ఇస్తున్నారు. కొన్నిచోట్ల రూ.వెయ్యి నుంచి రూ.2వేలు ఇస్తున్నారు. మంగళగిరిలో అత్యధికంగా వైసిపి వారు రూ.4 వేలు ఇచ్చారని తెలిసింది. టిడిపి వారు రూ.3 వేలు ఇచ్చారని తెలియడంతో వైసిపి వారు రూ.4 వేలకు పెంచారు. పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో డబ్బు పంపిణీ యథేచ్ఛగా సాగుతోంది. నియోజకవర్గాల్లో వివిధ సామాజిక వర్గాల గ్రూపు నాయకుల ద్వారా ఈ పంపిణీని చేపట్టారు. కొంత మంది అభ్యర్థులు ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారు.

బాబు మేనిఫెస్టోను అమలు చేయరు

(మొదటి పేజీ తరువాయి)

రూ.87,612 కోట్లు ఎందుకు చేయలేదన్నారు. పొదుపు సంఘాలకు రూ.14,205 కోట్లు రద్దు చేస్తామని చేయలేదన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆడపిల్ల పుడితే రూ.25 వేలు బ్యాంకులో వేస్తామని ఇప్పటి వరకు వేయలేదన్నారు. అర్హులైన పేదలకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఒక్కసెంటు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఇప్పుడు మళ్లీ సూపర్ సిక్స్ అంటూ ప్రతి ఇంటికీ బెంజ్ కార్ ఇస్తామని, బంగారం ఇస్తామని వస్తున్నారని, వారు మాయమాటలు విని మోసపోవద్దని కోరారు. చిలకలూరిపేట ఎమ్మెల్యేగా కావటి శివనాగ మనోహర్ నాయుడును, నరసరావుపేట ఎంపీగా పి.అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సభలో ఎమ్మెల్సీలు మర్రిరాజశేఖర్, చంద్ర గిరి ఏసురత్నం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రేపటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో 1,915 పోలింగ్ కేంద్రాల్లో 372 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని, 1,498 పోలింగ్ కేంద్రాల్లో (78 శాతం) వెబ్‌కాస్టింగ్ చేస్తామని వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 487 మందిని మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు 176 మందిని సెక్టార్ ఆఫీసర్లుగా నియమించారన్నారు. పోలింగ్ కేంద్రాల లోపల, క్యూ లైన్లకు మూడు వేల సీసీ కెమెరాలతో పాటు 187 మంది వీడియోగ్రాఫర్ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు.

పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు తాడికొండ నియోజకవర్గంకు గుంటూరు జెకెసి కాలేజీ, మంగళగిరి నియోజకవర్గానికి మంగళగిరి ఆత్మకూరులోని నిర్మలా హై స్కూల్ , పొన్నూరు నియోజకవర్గంకు పొన్నూరు పట్టణం నిడుబ్రోలులోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ , తెనాలి నియోజకవర్గానికి తెనాలిలోని జెఎంజె గ్లోబల్ స్కూల్, ప్రత్తిపాడు నియోజకవర్గానికి గుంటూరు టీజెపిఎస్ కాలేజీ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి గుంటూరు లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బి.ఈడి కాలేజీ, గుంటూరు తూర్పు నియోజకవర్గంకు సాంబశివరావుపేటలోని ఏసీ కాలేజీకి ఆదివారం ఉదయం 7 గంటలకు వెళ్లి ఎన్నికల సామాగ్రి, ఈవియంలు తీసుకొని ఏర్పాటు చేసిన బస్సుల్లో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలింగ్ సామగ్రి తీసుకువెళుతున్న వాహనాలకు, సెక్టోరల్ అధికారుల వాహనాలకు బందోబస్తుకు వచ్చే పోలీసు వాహనాలకు జిపిఎస్ పరికరాలను ఏర్పాటు చేశామని, కలక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుండి, రిటర్నింగ్ అధికారుల కార్యాలయం నుండి పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. పోలింగ్ రోజు అభ్యర్థులు తిరగడానికి ఒక వాహనం, వారి ఏజెంట్‌కు ఒక వాహనం, కార్యకర్తలకు ఒక వాహనం మొత్తం మూడు వాహనాలకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రతి వాహనంలో ఐదుగురుకి మించి ప్రయాణించడానికి వీల్లేదని, అభ్యర్థికి అనుమతించిన వాహనాన్ని ఇతరులు వినియోగించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుండి అభ్యర్థులు ఓటర్లను ప్రభావితపరిచేలా సమావేశాలు, ర్యాలీలు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్ చేయరాదన్నారు.

ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను కలక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 0863-2234301కు తెలపొచ్చని చెప్పారు. సివిజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు 98 శాతం పరిష్కరించామన్నారు. ఎన్నికల రోజు కలక్టరేట్‌లో కమ్యూనికేషన్, మీడియా మానిటరింగ్ కంట్రోల్ రూమ్, వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పోలింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తామని చెప్పారు. మీడియాలో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 20 శాతం అదనంగా అవసరమైన ఈవిఎంలను కమీషనింగ్ చేసి సిద్ధం చేశామని, పోలింగ్ కేంద్రాల్లో ఈవిఎంల సమస్యలు ఉత్పన్నమైతే 15 నిమిషాల్లోగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని పరిష్కరించేలా సెక్టరల్ అధికారులతో పాటు సాంకేతిక సిబ్బందిని అన్ని మండలాల్లోనూ అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లాకు బిఈఎల్ కంపెనీ నుండి 21 మంది ఈవిఎం ఇంజినీర్లు వచ్చారని, నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున కేటాయించామని తెలిపారు.

జిల్లాలో హోం ఓటింగ్‌కు 2,348 మంది దరఖాస్తు చేసుకోగా 2,292 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. 20,397 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పోలింగ్ రోజు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు తెలిపారు. పౌరుల ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా యాజమాన్యాలు సెలవు ప్రకటించకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓటర్లంతా ఓటేయాలని, ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎన్నికల సంఘం అనుమతించిన ఇతర గుర్తింపు కార్డులు పాస్ పోర్ట్ , డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు , పాన్ కార్డు తదితర 12 రకాల గుర్తింపు కార్డులతో ఏదో ఒకటి తీసుకొని వెళ్లాలని సూచించారు. ఇప్పటికే ఓటరు స్లీప్‌ల పంపిణీ పూర్తి అయిందని, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, వేసవి ఎండల దృష్ట్యా నీడ కోసం షామియానాలు, తాగునీరు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. వికలాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్స్, కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు.

ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు దాదాపు నాలుగు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 11 కంపెనీల సిఎపిఎఫ్ , ఎస్ఎపి సిబ్బంది వున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రతతో పాటు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్సెస్, పికెట్స్, చెక్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఇప్పటికే మద్యం షాపులన్నీ మూయించామని, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓటు లేని ఇతర ప్రాంతాల వ్యక్తులు ఉండకుండా ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే జొన్నను గెలిపించండి

- లోకేష్ ను గెలిపిస్తే నియోజకవర్గం వైపు కన్నెత్తి కూడా చూడడు
- విలేకరుల సమావేశంలో మహానాడు కాపు నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు బలపరిచిన ఇండియా బ్లాక్ వేదిక మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావును గెలిపించాలని మహా కాపునాడు నాయకులు పెద్ద అడపా పుల్లారావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు కాపు జేఏసీ, కాపు జాగృతి నాయకులు సంయుక్తంగా శనివారం సాయంత్రం ప్రెస్ క్లబ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడారు. పుల్లారావు మాట్లాడుతూ, మంగళగిరిలో జొన్న శివశంకర రావును గెలిపించాలని, ఆ బాధ్యత నియో జకవర్గ ప్రజలు తీసుకోవాలని అన్నారు. అవినీతి మచ్చలేని ఆయనను ఎందుకు గెలిపించకూడదని ప్రశ్నించారు. మంచి నేత జొన్న అని, ఉద్యమాల కోసం లాఠీ దెబ్బలు తిని జైలుకు కూడా వెళ్లారని, ఇరవై ఏళ్ల పాటు ఉండవల్లి సర్పంచ్‌గా పనిచేసిన ఆయన, గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ వయసులో కూడా రైతు సంఘం రాష్ట్ర నాయకుడిగా రైతుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. నారా లోకేష్ ను గెలిపిస్తే మంగళగిరి వైపు కన్నెత్తి చూడడని మురుగుడు లావణ్యని గెలిపిస్తే ఇంటి నుండి బయటకు వచ్చే పరిస్థితి ఉండదని విమర్శించారు. జొన్న శివశంకరరావును గెలిపిస్తే పేద ప్రజల పక్షాన పోరాటం చేసి సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అండగా నిలుస్తారని అన్నారు.కాపు జేఏసీ కాపు జాగృతి రాష్ట్ర నాయకులు మార్కండేయులు మాట్లాడుతూ, పిలిచిన వెంటనే సమస్యలపై ముందుకు వచ్చి పోరాడే స్థానిక వ్యక్తి శివశంకరరావును అత్యధిక ఓట్ల మెజార్టీతో ప్రజలు గెలిపించాలని పిలుపు నిచ్చారు. కాపు జేఏసీ కాపు జాగృతి రాష్ట్ర నాయకులు జొన్న రాజేష్ మాట్లాడుతూ, 40 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత కమ్యూనిస్టులకే ఉందని అన్నారు. అటువంటి కమ్యూనిస్టు నేత శివశంకర రావును గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అప్పుడు మాత్రమే అవినీతి అక్రమాలకు సరైన సమా ధానం చెప్పినట్లు అవుతుందన్నారు. మంగళ గిరిలో ఇప్పటి వరకు పనిచేసిన పాలకులు కనీసం డ్రైనేజ్ సమస్యను పరిష్క రించలేదని విమర్శిం చారు. కార్యక్రమంలో కాపు జాగృతి, కాపు జేఏసీ నాయకులు దాసరి దుర్గా మల్లేశ్వర రావు, తాడికొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సుమారు నెల రోజుల నుండి కొనసాగిన ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. ఇప్పటి వరకూ అభ్యర్థులు,. నాయకులు, హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. మైకులతో మోత పుట్టించారు. ఇప్పుడవి మూగబోవడంతో జనం హమ్మయ్య అని అనుకుంటున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

పల్నాడు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఓటరు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ కోరారు. ఎవరైనా వ్యక్తులు అవాంఛనీయ సంఘటనలకు, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు గాని పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లా డుతూ జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 6000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చసినట్లు చెప్పారు. సుమారు 20 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలను కూడా బందోబస్తు విధులకు సిద్ధంగా ఉంచామని, ఈ బందోబస్తులో పోలింగ్ కేంద్రాల వద్ద స్టాటిక్ ఫోర్స్ , ఎస్సై స్థాయి అధికారితో రూట్ మొబైల్ పార్టీ , సిఐ స్థాయి అధికారితో మండల పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్స్, డిఎస్పి స్థాయి అధికారితో నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ గా నాలుగు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీరి పర్యవేక్షణకు గాను ప్రతి నియోజకవర్గానికి అదనపు ఎస్పీ స్థాయి అధికారి అదనపు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ తో సిద్ధంగా ఉంటారని చెప్పారు. అదేవిధంగా పల్నాడు జిల్లాలో 558 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాలకు ప్రత్యేకంగా కేంద్ర పారా మిలిటరీ బలగాలను నియమించినట్లు చెప్పారు.

జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏదైనా సంఘటన జరిగితే దగ్గరలో ఉన్న అధికారులకు తెలిపి, వెంటనే తగు చర్యలు తీసు కునేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్క బరచడానికి క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లు అన్ని పోలింగ్ స్టేషన్ల దగ్గరికి తిరుగుతూ ఉంటాయని అన్నారు. ఇప్పటివరకు పల్నాడు జిల్లాల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి 5 కోట్ల 78 లక్షల 15 వేల 98 రూపాయలు విలువ చేసే చీరలు, సారాయి, మద్యం, నగదు ఇతరత్రా తాయిలాలు అన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

పోలింగ్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి లక్ష్మి కుమారి

ప్రజాశక్తి - పొన్నూరు

ఎన్నికల కమీషనరు వారి ఆదేశముల మేరకు నియోజకవర్గం లో మండలానికి ఒక్కటి చొప్పున నాలుగు పోలింగు కేంద్రాలను మోడల్ పోలింగు కేంద్రముగా ఏర్పాటు చేయటం జరిగిందని పొన్నూరు రిటర్నింగ్ అధికారి లక్ష్మి కుమారి పేర్కొన్నారు. శనివారం మోడల్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాల్లో 52 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, ఆయా కేంద్రాల్లో పోలింగు ప్రక్రియ పర్యవేక్షణకు మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. 12వ తేదీ ఉదయం 7.00 గంటలకు ఈవీఎంలు ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ అధికారుల ద్వారా పంపిణి చేసేందుకు సెయింట్ ఆన్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి కోసం మొత్తము 64 బస్సులను, 11 చిన్న బస్సు లతోపాటు 2 టాటా మ్యాజిక్ వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేశారు. 13 వ తేదీన పోలింగు ప్రక్రియ అనంతరం ఈవీఎంలు ఇతర ముఖ్య ఎన్నికల సామగ్రిని రిసెప్షన్ కేంద్రం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ధర్మల్ సైన్సు ల్యాబ్ బ్లాక్‌లోని స్ట్రాంగ్ రూములను భద్రపరచనున్నట్లు ఆర్వో వివరించారు.

వినుకొండలో కూటమి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - వినుకొండ



రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడం, జూన్ 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. కనీసం 155-160 సీట్లు గెలిచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే బొల్లా చేసిన అవినీతి సాక్ష్యాధారాలతో సహా నిరూపించడం, అతడు జైలుకు పోవడం కూడా ఖాయమన్నారు. శనివారం ప్రచారం ముగింపు సందర్భంగా వినుకొండలో జీవీ ఆంజనేయులు ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెనతో కలిసి ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్నారు. పలు వార్డుల్లో ప్రచార రథంతో రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవ రాయలును గెలిపించాలని కోరారు.శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అహంకారాన్ని ప్రజలు దించబోతున్నారని అన్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజల ఆస్తులను దోచుకునే వారు కావాలా, వాటిని రక్షించి అభివృద్ధి చేసే వారు కావాల అనే అంశంపై నిర్ణయం చేసే సమయం అసన్నమైందని ఎన్‌డిఎ కూటమి అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వలన ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని అన్నారు.

ఇళ్ల పట్టాలిప్పించాలని జొన్నాకు పేదల వినతి

నాలుగు దశాబ్దాల నిరీక్షణ - నేతలు మారినా తలరాతలు మారలేదంటున్న కాలనీ వాసులు

సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు బాపనయ్యనగర్ ప్రజల వినతి



బాపనయ్య నగర్‌లో జొన్నా శివశంకరరావుకు వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి- తాడేపల్లి

నిష్కలంగా రాజకీ య నాయకుడు గుంటూరు బాపనయ్య పేరుతో ఎర్రజెండా అండతో ఏర్పడిన ఉండవల్లి దళితవాడకు వెళ్లే చప్టాకు ఇరువైపులా 40 ఏళ్ల కిందట పేదలు వేసుకున్న ఇళ్లు ఈ 40 ఏళ్లలో ఎందరో నేతలు మారారు. మా తలరాతలు మాత్రం మారలేదు అంటున్నారు బాపనయ్యనగర్ కట్టవాసులు. ఇళు వేయించిన సిపిఎం కొన్ని వందల సార్లు అధికారులకు, అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఆ ప్రాంతానికి బైక్‌ర్యాలీ వచ్చిన సందర్భంగా ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. మీరే మాకు పట్టాలు కూడా ఇప్పించాలని కోరారు. ఇప్పటికీ సరైన రహదారులు లేవని, డ్రైనేజీ సమస్య పట్టిపీడిస్తుందని వాపోయారు. ఎన్నికల సమయంలో వచ్చే పాలకపార్టీల నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని చెప్పారు. ఓ ప్రజాప్రతినిధి తనను గెలిపిస్తే మీ సమస్య చిటికెలో పరిష్కరిస్తామని చెప్పి ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 300 కుటుంబాలు నివాసం ఉంటున్న తమ ఇళ్లను క్రమబద్ధీకరించి ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి ఇటీవల క్రమబద్ధీకరణకు స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, కలెక్టర్ వేణుగోపాలరెడ్డితో చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా పరిష్కారం కాలేదని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 15 వేల మంది ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్నారని, వారందరికీ పట్టాలు ఇచ్చేందుకు కృషి చేయాలని సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర్‌ను కోరారు. గతంలో సర్వే డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు సర్వే నిర్వహించి అందరికీ న్యాయం చేస్తామని హామీనిచ్చినా నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. బాపనయ్యనగర్ 300 కుటుంబాలకు స్థలాలిచ్చి ఇళ్లు వేయించింది ఎర్రజెండా ఆధ్వర్యంలోని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి ఆనాడు సర్పంచ్‌గా ఉన్న సమయంలో చేసిన కృషి తప్ప మరెవ్వరూ తమకు సాయం చేయలేదని చెప్పారు. సిపిఎం ద్వారానే మాకు న్యాయం చేయాలని శివశంకర్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సైకం వెంకటనారాయణ, సైకం నాగేశ్వరరావు, సామ్రాజ్యం, శైలజ, సురేష్‌బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి నియోజకవర్గ ప్రజలకు నాదెండ్ల వరాల జల్లు

అభివృద్ధి ప్రణాళిక విడుదల చేసిన జనసేన అభ్యర్థి మనోహర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి నియోజ కవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొంది ంచామని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక బోస్ రోడ్డులోని జనసేన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తాను రెండు విడతలుగా శాసనసభ్యునిగా తెనాలి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించా నని, అభివృద్ధిలో తనదైన మార్క్ ఉందన్నారు. అధికారంలోకి రాగానే కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ముందుగా తెనాలి నుంచి గుంటూరు, అలాగే తెనాలి నుంచి మంగళగిరి కి నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపడతామని, అంతర్గత సిసి రోడ్లకు ప్రాధాన్యతనిస్తామన్నారు. పట్టణంలో చెత్త పన్ను ఎత్తివేసి మెరుగైన శానిటేషన్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. విద్య, వైద్యం కోసం పట్టణంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, అలాగే పిహెచ్‌సిలు, ప్రభుత్వ వైద్యశాలను మరింత ఆధునీకరిస్తామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి విస్మరించిన ముస్లిం షాదీఖానా నిర్మిస్తామన్నారు. కళాకారులను ప్రోత్స హించేందుకు పట్టణంలో సంగీత అకాడమీ ఏర్పాటు చేస్తామని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్రైస్తవులు, ముస్లింలు ఎదుర్కొంటున్న స్మశాన వాటిక స్థలాల సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామ న్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చేస్తామని, అన్నింటినీ మించి యువతను, విద్యార్థులను పెడదారి పట్టిస్తున్న గంజాయి పై ఉక్కు పాదం మోపి, గంజాయి రహిత తెనాలిగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలు అభివృద్ధి ప్రణాళికను దృష్టిలో ఉంచు కుని తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో బండారు రవికాంత్, కె వాసుదేవ నాయుడు, దివ్వెల మధుబాబు, టి వెంకటరమణరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై అనురాధ విమర్శలు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిని సొంతం కుటుంబం లా చూసుకున్న వ్యక్తి నారా లోకేష్ అని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. మంగళగిరిలో శనివారం మీడియాతో ఆమె మాట్లాడారు. నారా లోకేష్ 80వేలకు పైగా మెజార్టీతో గెలుస్తారు. వైసీపీ ప్రచారంలో జనం లేకపోయినా గ్రాఫిక్స్ తో వైసీపీ నేతలు, వారి సోషల్ మీడియా మాయ చేశారు. ధర్మవరంలో చేనేత వస్త్ర వ్యాపారులను దారుణంగా అవమానించారు. వారికి అండగా టిడిపి నిలబడింది. వైసీపీ నేతలపై కేసు నమోదు చేయించాము. ఈ రోజు మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య బాధిత కుటుంబం గురించి కనీసం పట్టించుకోలేదు. వారి గురించి మాట్లాడలేదు. మంగళగిరిలో ఏ పద్మశాలీ కుటుంబాన్ని వైసీపీ ఆదుకోలేదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వల్ల కడప జిల్లాలో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబానికి చెందిన యువతికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాల భరోసాగా నిలిచింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజల భూములు కబ్జా చేయాలని చూస్తున్నారు. దీనిపై మొదట గొంతు విప్పింది చంద్రబాబునాయుడు, లోకేష్ అని తెలిపారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి ఇంటి ఎదురు ఉన్న రోడ్డు తప్ప ఒక్క రోడ్డు అయినా వేశారా? సర్వశిక్ష అభయాన్ కింద ఎన్నో అరాచకాలు చేశారని అన్నారు. కరకట్ట రోడ్డు ఈ రోజుకూ ఎందుకు వేయలేదు? ప్రజల్లో సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టించారని విమర్శించారు.



మంగళగిరి నియోజకవర్గంలో జొన్నా గెలుపు కోసం మెగా బైక్ ర్యాలీ



ఉండవల్లి నుండి చినకాకాని వరకు నిర్వహించిన మెగా బైక్ ర్యాలీ





ప్రచార వాహనంపై అభ్యర్థి జొన్నా, పాశం రామారావు తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి

ఇండియా వేదికలోని సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ప్రజాతంత్ర పక్షాలు బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు గెలుపుని కాంక్షిస్తూ శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఉండవల్లి సెంటర్లో ప్రారంభమైన బైక్ ర్యాలీ క్రమశిక్షణగా బండెనక బండి కదిలాయి. ఉండవల్లి సెంటర్ బైక్ ర్యాలీని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రారంభించారు. ఓపెన్ టాప్ జీపులో అభ్యర్థి జొన్నా శివశంకర రావు, పాశం రామారావు, సిపిఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు సామ్యేలు ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఉండవల్లి సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఉండవల్లి గ్రామం గుండా ఉండవల్లి దళితవాడ, బాపనయ్యనగర్, పోలకంపాడు, సంజీవయ్యనగర్, ముగ్గురోడ్డు, తాడేపల్లి మెయిన్ రోడ్డు, కొత్తూరు, బైపాస్‌రోడ్డు మీదుగా రూరల్ గ్రామాల్లో సాగింది. మంగళగిరి పట్టణంలో ద్వారకా నగర్, వడ్లపూడి సెంటర్, మిద్ది సెంటర్, మెయిన్ బజార్, గాలిగోపురం, గౌతమ్ బుద్ధ రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్ మీదగా చిన్న కాకాని వరకు కొనసాగింది. వాడ వాడల ఎర్రజెండాకు అపూర్వ ఆదరణ లభించిందని ప్రజలు చూపించిన ప్రేమాభిమానాలను జీవితంలో మర్చిపోలేనని ఇండియా బ్లాక్ వేదిక తరపున మంగళగిరి నియోజక వర్గానికి సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్ తెలిపారు. సిపిఎం ప్రదర్శనకు పోలీసు బందోబస్తు అవసరంలేదని ఓ పోలీస్ అధికారి వ్యాఖ్యానం ప్రదర్శన క్రమశిక్షణగా సాగిందన డానికి నిదర్శనం. ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు జొన్నా శివశంకరరావు, జంగాల అజయ్ కుమార్‌లను గెలిపించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడారు. లోకేష్ స్థానికుడు కాదని.. 2014 లోని ఆయన నిజస్వరూపం బయటపడిందని... రెండు మంత్రి పదవులు అనుభవించి.. మంగళగిరికి చేసింది మాత్రం శూన్యమని అన్నారు. 25 వేల మంది పట్టాల కోసం అలమటిస్తుంటే ఒక్క పట్టా కూడా ఇచ్చిన పాపను పోలేదు అంటూ దుయ్యబట్టారు. మెగా కార్పొరేషన్ పేరిట ఇంటి పన్నుల భారం... విపరీతంగా పెంచేసి... చెత్త పన్ను వేసి ప్రజలను ఇబ్బంది పెట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలు స్వర్ణకారుల సమస్యలు డ్రైనేజీ మంచినీటి సమస్యలు పరిష్కరిం చాలన్నా... మంగళగిరి అభివద్ధి పథంలో ముందుకు పోవాలన్నా ఎమ్మెల్యేగా ఎన్నుకోవా లని జొన్న శివశంకరరావు ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, కె నళినికాంత్, ఈ మని అప్పారావు, ఎం రవి, ఎస్ ఎస్ చెంగయ్య, తాడేపల్లి సిపిఎం నాయకులు డి వెంకట్ రెడ్డి, మంగళగిరి సిపిఎం సీనియర్ నాయకులు జీవీ రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పి.గాంధీ, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.బాబూరావు, బి.బుల్లికోట ిరెడ్డి, కె.వెంకటయ్య, బి.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ద్వారకా నగర్ సమీపంలో సిపిఎం బైక్ ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి తాయి సుధీర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాయి శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. బాణా సంచి పేల్చి, పూలమాలలు వేశారు.





నాన్నకు ఓటేయ్యండి.. సమస్యల పరిష్కారానికి బాటెయ్యండి

తండ్రి జొన్నాను గెలిపించాలాని తనయుడు దినేష్ ప్రచారం


ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మంగళగిరి శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ జొన్నా శివశంకరరావు కుమారుడు జొన్నా దినేష్ శనివారం సాయంత్రం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ, వడ్డేశ్వరం గ్రామంలో సిపిఎం శ్రేణులతో కలిసి, ఇంటింటికి అభ్యర్థి కరపత్రాలు పంచుతూ, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపైన ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ 20 సంవత్సరాలు ఉండవల్లి గ్రామ సర్పంచ్ గా పలు అభివద్ధి పనులను చేసి, గ్రామ అభివద్ధికి తోడ్పడిన తన తండ్రి శివశంకరరావును మంగళగిరి శాసనసభ సిపిఎం అభ్యర్థిగా గెలిపించాలని అన్నారు. నియోజకవర్గ పరిధిలో సిపిఎం పార్టీ నాయకుడిగా, రైతు సంఘం రాష్ట్ర నాయకుడిగా పలు ఉద్యమాలలో, పోరాటాలలో పాల్గొన్న శివ శంకర రావు ను అసెంబ్లీకి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నరేంద్ర మోడీ బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ కూటమి ఏర్పడిందని ఆయన అన్నారు. మతోన్మాద బిజెపి విధానాలను, దాని పొత్తు పార్టీలైన తెలుగుదేశం, జనసేన, తొత్తు పార్టీ అయినా వైఎస్ఆర్సిపి పార్టీని ఓడించాలని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేసే సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావును సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపైన, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ ను కంకి కొడవలి గుర్తు పన ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం వడ్డేశ్వరం గ్రామ సహాయ కార్యదర్శి షేక్ గన్, సిపిఎం మండల నాయకులు పల్లె కష్ణ, సిపిఎం కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఓటర్ల ఆధిక్యం

పెదకూరపాడు నియోజకవర్గంలో 2,32,453 ఓట్లు



ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గంలో 2,32,453 ఓట్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. మొత్తం ఒక లక్ష 13,398 పురుష ఓట్లు, ఒక లక్ష 19,039 ఓట్లు మహిళలవి, ఇతరులవి 16 ఉన్నాయి. అమరావతి మండలంలో 69 పోలింగ్ కేంద్రాలు పురుషుల ఓట్లు 28405, మహిళ ఓట్లు 30,697, ఇతరులు రెండు ఓట్లు, మొత్తం 59,104 ఉన్నాయి. పెదకూరపాడు మండలంలో 49 పోలింగ్ కేంద్రాలు, పురుషుల ఓట్లు 20వేల 524, మహిళల ఓట్లు 21,706, ఇతరులు ఏడు ఓట్లు, మొత్తం 42,237 ఓట్లు ఉన్నాయి. క్రోసూరు మండలంలో 57 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పురుషుల ఓట్లు 24837 మహిళల ఓట్లు 25766 ఓట్లు ఇతరులు నాలుగు, మొత్తం 50 607 ఓట్లు ఉన్నాయి. అచ్చంపేట మండలంలో 61 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పురుషుల ఓట్లు 26,230 మహిళల ఓట్లు 27,174 ఇతరులు రెండు ఓట్లు మొత్తం 53,406 ఓట్లు ఉన్నాయి. బెల్లంకొండ మండలంలో 30 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓట్లు 27 వేల 99 ఉన్నాయి. పురుషుల ఓట్లు 13402, మహిళల ఓట్లు 13696 ఓట్లు ఇతరులు ఒక ఓటు ఉన్నాయి.

ప్రచారానికి తెర... ప్రలోభాలకు ఎర...

- ఓటర్లుకు పోటాపోటీగా తాయిలాలు
- వినూత్న పద్ధతుల్లో డబ్బు పంపిణీ
- ఓటరు స్లిప్పుల్లో క్యూఆర్ కోడ్



ముమ్మర ప్రచారంలో వైసిపి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి :సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఎట్టకేలకు శనివారం సాయంత్రంతో ముగిసింది. చివరి రోజున వైసిపి, కూటమి పార్టీలు నువ్వా నేనా అన్నట్లు బల ప్రదర్శనలకు దిగాయి. ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలకు రోజువారి అందించే నజరానా పెంచారు. ప్రతిరోజు ప్రచారానికి రెండు, మూడు గంటల వ్యవధికి మనిషికి రూ.300 చొప్పున చెల్లించిన పార్టీలు చివరి రోజున ఆ మొత్తాన్ని రూ.500కు పెంచాయి. అంతా కాకుండా ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని కూడా ఏర్పాటు చేసి భారీ ర్యాలీలు నిర్వహించారు. వీటన్నింటిని మించి గతం కంటే భిన్నంగా ఈ దఫా పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్ధులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. ప్రచారం ముగిసిన నేపథ్యంలో ఇక మిగిలిన చివరి అస్త్రం ప్రలోభాల ఎర. దీనికోసం గ్రామాల్లోకి పెద్ద పెద్ద వాహనాలు, కొత్త కొత్త వ్యక్తులు దిగుతున్నారు. దీంతో పట్టణంతో పాటు రూరల్ గ్రామాల్లోనూ సందడి మొదలైంది. అయితే తాయిలాల పంపిణీలో ప్రధాన పార్టీలు విలక్షణంగా వ్యవహరిస్తున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి నాదెండ్ల మనోహర్, వైసిపి నుంచి అన్నాబత్తుని శివకుమార్, బిఎస్పీ నుంచి కారుమంచి సునీల్ సందీప్, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ నుంచి శావల గోపాల్, మరికొందరు ఇండిపెండెంట్లు, ఇతర పార్టీలకు చెందిన వారితో కలిపి మొత్తం 13 మంది పోటీలో ఉన్నారు. ఈ నేపద్యంలో ఓటర్లను ప్రలోభాలాకు గురిచేసేందుకు ప్రధానపార్టీల తరపున వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఏ పార్టీ అభ్యర్థి ఓటరు స్లిప్పులు పంచినా దానిపై ఓటరు పేరు, ఓటరు జాబితాలో సీరియల్ నెంబర్, ఓటు వేయాల్సిన పోలింగ్ బూత్ వివరాలు మాత్రమే ఉండేవి. అందుకు భిన్నంగా ఈ దఫా కూటమి అభ్యర్థులు పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్పులలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ కోడ్ స్కాన్ చేయటం ద్వారా నిర్దిష్టంగా ఓటర్లకు నగదు పంపిణీ, ఖచ్చితంగా నగదు ఓటరుకు చేరేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అలాగే వైసిపికి సంబందించి పంపిణీ చేస్తున్న స్లిప్పులలో నియోజకవర్గంలో అందించిన సక్షేమ పథకాలు, దానికోసం వెచ్చించిన నగదు వివరాలను పొందుపరచి, స్లిప్పులో బ్యాలెట్ నమూనాతో పాటు ఎమ్మెల్యే ఫోటో ప్రచురించారు. స్లిప్పుతో పాటుగా నగదు కూడా పంపిణీ చేస్తున్నట్లు ఓటర్లు చెబుతున్నారు. పోటీపోటీగా ఎన్నికల ప్రచారం, తాయిలాల ఎర వంటి అంశాలు అభ్యర్థుల భవితవ్యం, ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ఫలితాలు చూపుతాయో వేచి చూడాల్సిందే.



కూటమి అభ్యర్థి ప్రచారానికి వచ్చిన వారికి టిఫిన్ పంపిణీ

పొన్నూరులో పాగా వేసేది ఎవరో..?



ధూళిపాళ్ల నరేంద్ర (టిడిపి)



అంబటి మురళీకృష్ణ (వైసిపి)



జక్కా రవీంద్రనాథ్ (కాంగ్రెస్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పొన్నూరు నియోజకవర్గంలో ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలలో ప్రధానంగా ముఖాముఖి పోటీ జరుగుతున్నా ఇండియా బ్లాక్ తరుపున కాంగ్రెస్ అభ్యర్థి జక్కా రవీంద్రనాథ్‌కు వచ్చే ఓట్ల వల్ల ఎవరికి నష్టం ఎక్కువగాఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది. టిడిపి తరపున ధూళిపాళ్ల నరేంద్ర, వైసిపి తరపున అంబటి మురళీకృష్ణ, కాంగ్రెస్ తరపున జక్కా రవీంద్రనాథ్ ఎన్నికల బరిలో నిలిచారు. 2019లో వైసిపి నుంచి కిలారు రోశయ్య 1200 ఓట్ల ఆధిక్యతతో టిడిపి అభ్యర్థి దూళిపాళ్ల నరేంద్ర పై గెలుపొందారు. 2014లో ధూళిపాళ్ల 7,761 ఓట్ల మెజార్టీ సాధించి రావి వెంకటరమణపై విజయం సాధించారు. 2019లో జనసేన అభ్యర్థి పార్వతీ నాయుడు పోటీ చేయడం వల్ల ఆమెకు 12 వేల ఓట్లు రావడంతో తాను ఓడిపోయినట్టు అప్పట్లో దూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే రోశయ్య వైసిపి నుంచి గుంటూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్నారు. రోశయ్య స్థానంలో మంత్రి అంబటి రాంబాబు సోదరడు అంబటి మురళీ వైసిపి నుంచి పోటీ చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం, టిడిపితో జనసేన, బిజెపి పొత్తు వల్ల తనకు లాభిస్తుందని నరేంద్ర ధీమాగా ఉన్నారు. టిడిపి ఆవిర్భాం నుండి ఇదే నియోజకవర్గం నుండి ధూళిపాళ్ల కుటుంబం హవా కొనసాగుతుంది. 1994 నుంచి 2014 వరకూ ధూళిపాళ్ల వరుసగా గెలుపొందుతూ వస్తున్నారు. ప్రతి సారి ఒక కొత్త ప్రత్యర్థి రావడం, ఆయన నియో జక వర్గంపై అవగాహన పెంచుకునేలోపు ఎన్నికలు పూర్తయి దూళిపాళ్లను విజయం వరిస్తోంది. దీంతో 1994 నుంచి 2014 వరకు దూళిపాళ్లకు ప్రత్యర్థుల బలహీనతలు ఆయనకు కలిసి వచ్చాయి. 2019లో మాత్రం సీన్‌ తారుమారు అయింది. తొలిసారిగా పరా జయం పాలైన నరేంద్ర నియోజ కవర్గం ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొన సాగి స్తున్నారు. అయితే టిడిపి కన్నా వైసిపికి బల మైన ఓటు బ్యాంకు ఉండటం వల్ల గత ఎన్నికల కన్నా ఈసారి తనకు అత్యధిక మెజార్టీ వస్తుందని, తన విజయం ఖాయం అని వైసిపి అభ్యర్థి అంబటి మురళీ చెబుతున్నారు. టిడిపిలో కూడా నరేంద్రపై అంతర్గతంగా అసమ్మతి ఉంది. ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య ఆధిపత్యపోరు ఉండటం ప్రతికూల అంశంగా భావిస్తున్నారు. దీనిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అంబటి ప్రయత్నిస్తున్నారు. 1983, 1985లో ఈ నియోజకవర్గం నుంచి టిడిపి గెలుపొందగా 1989లో కాంగ్రెస్ గెలిచింది. 1995 నుంచి 2014 వరకు వరుసగా టిడిపి గెలిచింది. 2019లో వైసిపి గెలుపొందగా ఈసారి టిడిపి,వైసిపి మధ్య పోటీ నువ్వా నేనా అన్న చందంగా సాగుతోంది. ఈ నియోజక వర్గంలో కీలకమైన మైనింగ్ వ్యాపారంపై దూళిపాళ్ల నరేంద్ర, కిలారు రోశయ్య మధ్య అవినీతి ఆరోపణలు ఉన్నాయి. చేబ్రోలు మండలలలో గ్రావెల్ వ్యాపారంలో ఇద్దరి పాత్ర వివాదస్పందం గానే ఉంది. ప్రత్యర్థుల విమర్శలకు అవకాశం ఇచ్చినా ఎవరు అధికారంలో ఉంటే వారిదే రాజ్యంగా మారుతోంది.

మద్యం దుకాణాలకు సీల్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియ ఆరంభానికి 48 గంటల ముందు విక్రయాలు నిలిపివేసేందుకు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లను మూసేసేందుకు ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలోని 118 మద్యం దుకాణాలు, 54 బార్లకు శనివారం సాయంత్రం 4 గంటల నుండి సీల్ వేస్తామని సోమవారం సాయంత్రం 7 గంటల తర్వాత మాత్రమే సీలు తొలగించి దుకాణం నిర్వహించాలని ఎక్సైజ్ శాఖాధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించినా, అక్రమంగా మద్యం విక్రయి ంచినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు.

ప్రజల్ని జగన్ మళ్లీ మోసం చేసే యత్నం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



నియోజకవర్గ సమస్యలపై కాకుండా అనవసర విషయాలతో ప్రజలను సిఎం జగన్ మోసం చేస్తున్నారని ఎన్‌డిఎ కూటమి తరుపున చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. అబద్ధాలు చెప్పే వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.



సంపూర్ణ మధ్య నిషేధం చేసిన తర్వాతే అక్కచెల్లెమ్మలను ఓటు అడుగుతానని గత ఎన్నికలప్పుడు మాటిచ్చిన జగన్ మోసం చేశారని, ఆయన మాటలను ఎవరూ నమ్మొద్దని టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి, చిలకలూరిపేట, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు మల్లెల రాజేష్ నాయుడు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాన సమస్యలను విస్మరించిన విడదల రజిని నియోజకవర్గాన్నే వదిలి వెళ్లారని, ఇప్పుడు గుంటూరులో ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని అన్నారు. ఇప్పటికే మోసపోయిన ప్రజలు మరోసారి మోసపోవద్దని, టిడిపి అభ్యర్థి పుల్లారావును గెలిపించాలని కోరారు.



ప్రచారం చివరి రోజు దోసెలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించి కూటమిని గెలిపించాలని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఎన్నికల ప్రచారం చేసిన ఆయన ఓ టీ దుకాణంలో టీ తయారు చేవారు. టిఫిన్ హోటల్లో దోసెలు వేశారు. ఆయా దుకాణాల నిర్వాహకులతో వారి సమస్యలపై మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణంతో మన పిల్లల భవిష్యత్తును మార్చుకుందామని అన్నారు. సోమవారం జరిగే పోలింగ్లో ప్రతి ఒక్కరూ తనతోపాటు నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు.

అన్నిచోట్లా ఓట్ల మాటే

- తారాస్థాయికి ఎన్నికల వేడి
- చివరి రోజు ప్రచారంలో పార్టీల దూకుడు
- భారీ ర్యాలీలతో బల ప్రదర్శన



చివరిరోజు ప్రదర్శనల్లో ప్రజలకు అభివాదం చేస్తున్న వైసిపి, టిడిపి అభ్యర్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలింగ్‌కు ఒక్కరోజే ఉండడంతో ఎన్నికల వేడి తారాస్థాకికి చేరింది. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ. ఎవరికి ఓటేద్దాం.. ఎవర్ని గెలిపిద్దాం.. అని ముచ్చటించుకుంటున్నారు. ప్రధాన కూడళ్ల, టీ షాపులు, హోటళ్ల, ఇతర దుకాణాలు, వాకింగ్ ట్రాక్ వద్ద అంతా ఎన్నికల వ్యవహారమే. ఆచితూచి ఓటేయాలని జనం ఆలోచిస్తుండగా ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రం ఓటర్లను ఆకర్షించేందుకు నానా పాట్లు పడుతున్నారు. మొన్నటి వరకూ ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో చిన్నాపెద్ద తేడా లేకుండా అందరికీ దండాలు పెట్టి ఓట్లడిగారు. ఆత్మీయ సమావేశాలు పేరిట వివిధ సామాజిక తరగతులను సమీకరించి హామీలను గుప్పించారు. ప్రచారం చివరిరోజైన శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో భారీగా జన సమీకరణతో బల ప్రదర్శనకు దిగారు. ఇలాంటి ప్రదర్శనలకు ఎంత ఖర్చయినా వెనకాడడం లేదు. గ్రామాల్లో ఉండే చోటామోటా నాయకులను తమవైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉండే కింది స్థాయి లీడర్లకు సైతం డిమాండ్ పెరిగింది. వారు పెట్టే షరతులనుసైతం అభ్యర్థులు, నాయకులు ఒప్పేసుకుని ఓట్లు వేయిస్తామనే హామీ తీసుకుంటున్నారు. ఎన్‌డిఎ కూటమి తరుపున నరసరావుపేట టిడిపి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం సత్తెనపల్లి - నరసరావుపేట వరకు భారీగా ట్రాక్టర్ ర్యాలీతో ముగింపు ర్యాలీ చేశారు.

గత ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో నరసరావుపేట పార్లమెంట్ స్థానంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలను వైసిపి కైవసం చేసుకుంది. నరసరావుపేట ఎంపీగా 2019 ఎన్నికల్లో వైసిపి తరుపున గెలిచిన శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తుతం టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన టిడిపిలో చేరిన దగ్గర నుండి పల్నాడు జిల్లాలో టిడిపి బలం పెరిగిందనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, టిడిపి మేనిఫెస్టోపై ఆకర్షణ వెరసి తాను విజయం సాధిస్తానని అరవిందబాబు ఆశాభావంతో ఉన్నారు. వైసిపి ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ సామాజిక సమీకరణలపై ఆశ పెట్టుకోగా ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సంక్షేమ పథకాల కారణంగా హ్యాట్రిక్ సాధిస్తాననే ధీమాతో ఉన్నారు. వీరిద్దరూ శనివారం నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద నుండి వినుకొండ రోడ్డులోని వైసిపి కార్యాలయం వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు.



జనం ఆస్తులపై జగన్ కన్ను : ప్రవీణ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రజల ఆస్తులపై జగన్ కన్ను పడిందని, ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని ఎన్‌డిఎ కూటమి తరుపున పెదకూరపాడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గంలోని అచ్చంపేటలో ఆంజనేయస్వామి విగ్రహం నుండి క్రోసూరు మీదగా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం లోని ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వరకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్తులను జగన్ ప్రభుత్వం తాకట్టు పెట్టడం, అమ్మటం చేసిందని, ఇప్పుడు ఇప్పుడు ప్రజల ఆస్తులపై పడ్డారని ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అందులో భాగమని చెప్పారు. తనను గెలిపిస్తే పులిచింతల బ్యాక్ వాటర్ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఇసుకను వైసిపి ప్రభుత్వం అప్పనంగా దోచుకుందని, కూటమి అధికారంలోకి రాగానే ఇసుకను పూర్తిగా అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివరెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాల టిడిపి అధ్యక్షులు ఎ.రమేష్, విష్ణు, బాష, ఎన్.ఆశీర్వాదం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చరిత్రహీనుడిగా మహేష్‌రెడ్డి : యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గం చరిత్రలో చరిత్ర హీనుడుగా కాసు మహేష్‌రెడ్డి నిలిచిపోతారని ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అటు రాష్ట్రాన్ని ఇటు నియోజకవర్గాన్ని వైసిపి రాక్షసులు నాశనం చేశారని, కూటమి అధికారంలోకి రాగానే మొదటి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌ని, రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దని అన్నారు. గురజాల నియోజకవర్గంలో గత ఐదేళ్లలో 11 మంది టిడిపి కార్యకర్తలను హత్య చేశారని, 8 మంది చిన్నారులను అక్రమైనింగ్‌తో బలి తీసుకున్నారని విమర్శించారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఏ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తనపై అనేక ఆరోపణలు చేసిన వైసిపి నాయకులు ఒక్క కేసు కూడా పెట్టలేక పోయారని, వాటిని నిజం చేయలేకపోయారని అన్నారు. తనపై అవినీతి రాతలు రాసిన సాక్షి పత్రికపై కేసు వేస్తానన్నారు. నియోజకవర్గం కోసం ప్రత్యేకంగా సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధిని పెంచుతామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమిని గెలిపించాలని, ఎమ్మెల్యేగా తనను, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలుకు ఓటేయాలని కోరారు. అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో కాపీలను దహనం చేశారు.

దళితుల భూములపై మాట్లాడని ఆ పార్టీలు : సిపిఎం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా సమస్యలను విస్మరించిన వైసిపి, టిడిపి, కేంద్రంలోని బిజెపిలు ఇప్పుడు ఎన్నికల కోసం కల్లబొల్లి మాటలు చెబుతున్నారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటి పన్నుల భారం మోపారని, చెత్తపన్ను వేశారని విమర్శించారు. ప్రమాదకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును మూడు పార్టీలు కలిసే తెచ్చాయన్నారు. యడవల్లి, మురికిపూడి దళిత భూముల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలేమీ మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి, దేశ సమగ్రతకు ప్రమాదమని, ఈ నేపథ్యంలో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నరసరావుపేట ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్‌ను, చిలకలూరిపేట ఎమ్మెల్యేగా ఎం.రాధాకృష్ణకు ఓటేయాలన్నారు. సిపిఎం పట్టణ



కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, నల్ల ధనాన్ని తెచ్చి పేదల ఖాతాల్లో వేయడం వంటి హామీలిచ్చిన బిజెపి దేశ ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతోందని, ఆ పార్టీని మళ్లీ గెలిపిస్తే దేశం మరింత ఇబ్బందుల్లో పడుతుందని చెప్పారు. సిపిఎం నాయకులు ఎస్.లూథర్ మాట్లాడుతూ వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టి రైతులకు ఉచిత విద్యుత్‌ను దూరం చేస్తున్నారు. ఆయా పార్టీలు చెప్పే మాటలను నమ్మకుండా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మళ్లీ గెలిపిస్తే అండగా ఉంటా : శంకరరావు

ప్రజాశక్తి - పెదకూరపాడు



ఐదేళ్లుగా కుటుంబాన్ని వదిలి ప్రజలే కుటుంబంగా భావించి సేవ చేశానని, తనను మరోసారి గెలిపించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకర్రావు కోరారు. శనివారం అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి ఆలయం నుండి పెదకూరపాడు మీదుగా క్రోసూరు నుండి బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తనను మరోసారి గెలిస్తే ఇంకా ఐదేళ్లు మీకు అండగా ఉంటానని అన్నారు. అమరావతి నుండి బెల్లంకొండ రోడ్డు పూర్తి కాబోతుందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి చేశామని, తనతోపాటు ఎంపీగా అనిల్ కుమార్ గెలిపించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 244 పోలింగ్ స్టేషన్లు

ప్రజాశక్తి-తాడికొండ

లోకసభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు నియోజకవర్గంలోని గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 244 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. తాడి కొండలో 66, తుళ్లూరులో 52, మేడికొండూరులో 61, ఫిరంగిపురంలో 65 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గంలో 2,07,615 మంది ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళలు 1,07,519 మంది.పురుషులు 1,00,093 మంది, ముగ్గురు థర్డ్ జెండర్లు ఉన్నారు. ఓటర్ల కోసం కేంద్రాల వద్ద షామియానాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. వికలాంగ ఓటర్ల కోసం ట్రైసైకిళ్లను ఆటోలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దివ్యాంగ ఓటర్లకు ర్యాంపుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మంచినీటి వసతి, భోజన వసతి పోలింగ్ సిబ్బందిఇ కోసం ఏర్పాట్లు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సౌకర్యార్థం వైద్య సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేం ద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ కెమెరాలను ఏర్పాటు చేసారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు తమ ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లు తదితర ఎన్నికల సామాగ్రితో చేరుకోనున్నారు.

వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నిలక రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.గంగ రాజు తెలిపారు. నియోజకవర్గంలోని 244 పోలింగ్ స్టేషన్లలో అన్ని సదు పాయాలు కల్పిస్తు న్నట్లు చెప్పారు. ఇప్పటికే అన్నిచోట్ల విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గదుల ఏర్పాటు, తాగు నీటి సౌకర్యం, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఆలోచించి ఓటు వేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎస్సి, ఎస్టి, బిసిలు ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలో చించి వేయాలని రిపబ్లిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు కోరారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో రూ.72 వేల కోట్ల ఎస్సి సబ్‌ప్లాన్ నిధులు పథకాలు రూపంలో మళ్లించారని విమర్శించారు. బిసిలను మనుషులుగా గుర్తించని జగన్ సర్కార్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

ఫిరంగిపురంలో 'ఇండియా వేదిక' ప్రచారం



ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఎన్నికల ప్రచారంలో భాగంగా. చివరి రోజు.శనివారం ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం సిపిఐ, సిపిఎం నాయకులు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.తక్కెళ్ళపాడు పొనుగుపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మంచాల సుశీల్ రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో. రాష్ట్ర రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్, కె.దేవుని దయ, తాడికొండ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, జిల్లా రైతు సంఘం నాయకులు. మార్పుల వెంగళరెడ్డి, ఫిరంగిపురం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, పేరేచర్ల సిపిఎం నాయకులు ఎస్ఎం బాషా, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఓటుకు లక్ష తీసుకోండి'

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ ఎమ్మెల్యే కమల కుమార్తె, ఎమ్మెల్సి కోడలు మంగళగిరి వైసిపి అభ్యర్థి మురుగుడు లావణ్య వద్ద నుండి ఓటుకు లక్ష రూపాయలు తీసుకోండి అని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుర్రం రామా రావు ఓటర్లను కోరారు. మంగళగిరిలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన



మాట్లాడుతున్న గుర్రం రామారావు

మీడియా సమావేశంలో ఆయన మాటా ్లడుతూ 2009 నుండి 2014 వరకు మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్న కాంగ్రెస్ కమలపై ఆయన విమర్శలు చేశారు. 2009లో వడ్లపూడిలో వైయస్ విగ్రహం ఏర్పాటు చేసిన సమ యంలో జగన్ పక్కన తాను ఉన్నానని, మంగళగిరి నియోజక వర్గంలో వైయస్ విగ్ర హాలు ఏర్పాటు చేయొద్దని నాడు ఆమె చెప్పిందని ఆయన గుర్తు చేశారు. వైఎస్ఆర్ విగ్రహాలు పెడితే పోలీసులు చేత కేసులు పెట్టిస్తామన్న విషయాన్ని ప్రస్తావిం చారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు చేసి 28 మందిని హత్య చేసిన సంఘటనలపై కనీసం ఖండన కూడా జగన్ ఇవ్వలేదని విమర్శించారు. లక్షల కోట్లు దోచుకుని దళితులను అణచి వేసిన జగన్‌ను ఓడించాలని ఓట ర్లకు విజ్ఞప్తి చేశారు. సమా వేశంలో నాయకులు జి. భాగ్య రాజు, జి.ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు వైసిపిని గెలిపించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పేదలకు ప్రస్తుతం అందుతున్న పథకాలు కొనసాగాలంటే వైసిపి మళ్లీ గెలిపించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి , ఎమ్మెల్యే మద్దాలి గిరి , రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ మందపాటి శేషగిరి రావు, నరసరావుపేట పేట అసెంబ్లీ పరిశీలకులు గులాం రసూల్,విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, జిల్లా అధ్యక్షులు వినోద్,వైసీపీ ముఖ్య నాయకులు జియా ఊర్ రెహమాన్ ఇతర ముఖ్య నాయకులతో కలసి భారీ ర్యాలీతో నియోజవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో విస్తతంగా పర్యటించారు. అనంతరం స్థానిక ప్రజలకు అభివాదం చేస్తూ మరో రెండు రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో తమ విలువైన ఓట్లను ఫ్యాన్ గుర్తు పై వేసి తనని గెలిపించాలని నియోజకవర్గం ప్రజలను ఆమె కోరారు..సంక్షేమ పథకాలు అమలు చేయడం తెలిసిన నాయకుడు కావాలో,

సంక్షేమన్ని అడ్డడుగు తీసుకువెళ్లే కూటమి నాయకులు కావాలో జనం ఆలోచన చెయ్యాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తమ విలువైన ఓటును ఫ్యాన్ గుర్తు పై వేసి రాష్ట్రంలో సంక్షేమ సారధిని గెలిపించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు తన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వైసిపి ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు వల్ల ప్రజలకు నష్టం ఉందంటూ ఆయన చేస్తున్న ప్రచారంలో ఎక్కడా నిజం లేదన్నారు. దస్తావేజులు ఒరిజినల్‌కు బదులు జిరాక్సులు ఎక్కడా ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఇది తప్పుడు ప్రచారం అన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ప్రమాదకరం

టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది చాలా ప్రమాదకరమైందని గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఆమె మీడియాతో మాట్లాడుతూ సర్వే రాళ్ళ పేరుతో ప్రజా ధనం వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆస్తి కాగితాలు ప్రభుత్వం వద్ద ఉంటే అధికారులు దోచుకునే అవకాశం ఉందన్నారు.

గత ఐదేళ్లుగా అరాచకపాలనతో వైసిపి ప్రజలను తీవ్ర ఇబ్బంది పెట్టిందన్నారు. గత నాలుగు నెలలుగా తమ ప్రచారం సజావుగా సాగిందన్నారు. ప్రజలంతా సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కేంద్రం నుంచినిధులు తెచ్చుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రం నిధులకు రాష్ట్రం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వక పోవడం వల్ల పలు ప్రాజెక్టులు కుంటుపడ్డాయని తెలిపారు. దీంతో రా ష్ట ం లో అభివృద్ధి కుంటు పడిం దన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తెప్పించి పెండిం గ్‌లో ఉన్న ప్రాజె క్టులను పూర్తిచేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గుంటూరులో ఎన్నికల కోసం గడిచిన 4 నెలలుగా విపరీతంగా కష్టపడుతూ అన్నీ గ్రామాలు, పట్టణాలలో,గ్రామాల్లో, వార్డుల్లో, 300 కి పైగా బహిరంగ సభలను నిర్వహించి ప్రజలకు చేరువయ్యామని తెలిపారు. వైసిపి ఎంపి అభ్యర్థి కిలారి రోశయ్య మూడు రాజధానులకి సపోర్ట్ చేస్తుంటే టిడిపి పార్టీ ఒక రాజధాని స్టాండ్ తో ఉందన్నారు. అవినీతి డబ్బులు పంచిపెట్టి ఓట్లు సంపాదించ లేరని చెప్పారు. తనకు పెమ్మసానికి 2 నుండి 3 లక్షల మెజార్టీ వస్తుందని తెలిపారు. ఒక్కరోజు ఓటు వేస్తే...ఐదేళ్ళు మీ కోసం పని చేస్తానని తెలిపారు. ప్రధాన సమస్యలు అంటే నీళ్ళు, నిరుద్యోగం, రహదారులు, మౌలిక వసతులు కల్పించాలని, గంజాయి ని నిర్మూలించాలన్నదే తన ప్రధాన లక్ష్యం అన్నారు. 2019 కి ముందు 250 కోట్లు గుంటూరు ఛానల్ అభివద్ధి కోసం టిడిపి ప్రభుత్వం జీవో విడుదల చేశారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ జీవో నిధుల్ని దారి మళ్ళించిన వైసిపి ప్రభుత్వానిదే నన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిసి హేమంత్ నాగరాజు

ఎస్ఇబి కార్యాలయంలో డిసి తనిఖీ

ప్రజాశక్తి-తెనాలి

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయాన్ని శనివారం ఎస్ఇబి స్పెషల్ నోడల్ డిప్యూటీ కమిషనర్ కె హేమంత్ నాగరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనధికార మద్యం నిల్వలు, తరలింపు వంటి ఘటనలపై నమోదైన కేసులను, సంబంధిత అధికారలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో అనధికార మద్యం నిల్వలను ఉపేక్షించవద్దని, మద్యం పంపిణీ వంటివి అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు. క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు తూర్పు నియోజకవర్గానికి 13న జరిగే పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిణీకి స్థానిక ఏసీ కాలేజిలో ఏర్పాట్లు పూర్తి చేశామని నగర కమిషనర్, ఆర్ఒ కీర్తి చేకూరి తెలిపారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన పోలింగ్ మెటీరియల్‌ను ఆదివారం ఉదయం 7 గంటల నుండే పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర కమిషనర్ శనివారం ఏసి కాలేజిలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది పిఓలు, ఏపిఓలు ఉదయం 7 గంటలకే ఏసి కాలేజిలో రిపోర్ట్ చేయాలన్నారు. తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను 22 సెక్టార్లుగా విభజించి, ప్రత్యేకంగా అధికారులను కేటాయించామన్నారు. సెక్టార్ వారీగా టేబుల్స్, మెటీరియల్ ప్యాకింగ్‌కు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పిఓలు రిపోర్ట్ చేసిన వెంటనే వారికి పిడిఎంఎస్ యాప్ డౌన్‌లోడ్, లాగిన్ చేయడం, అటెండెన్స్ కోసం సిబ్బందిని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.



తెలంగాణ స్పెషల్ పోలీసులతో కవాతు నిర్వహిస్తున్న సిఐ సుధాకర్

ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. పట్టణంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని రెండవ పట్టణ సిఐ ఎ.సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం మార్చ్ ఫాస్ట్ నిర్వ హించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఎర్రబడి సెంటర్, లింగారావు సెంటర్, పేరంటాళ్లమ్మ గుడి, ఐతానగర్, రజక చెరువు మీదుగా గాంధీ చౌక్ వరకు పోలీసు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. యువత గుమికూడి మీటింగులు నిర్వహిం చొద్దని, మద్యం అక్రమంగా తరలించినా, అనవసరంగా రాత్రి పూట సంచరించిన శాఖాపరమైన చర్యలు తప్పవని యువ కులను సిఐ హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ దాసు, కానిస్టేబుల్ సాంబయ్య పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆర్ఓ పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రేపు జరిగే పోలింగ్‌కు సంబంధించి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 292 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం లాడ్జి సెంటర్‌లోని ఏ.యల్ బి.ఈ.డి కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లను అదనపు కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 13 న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఏ సమస్య లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేశామని, వికలాంగుల కోసం ర్యాంప్ లు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న గుంటూరు వెస్ట్ అర్ఓ

పశ్చిమ నియోజకవర్గంలోని మొత్తం 292 పోలింగ్ కేంద్రాల్లో 218 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయుటకు చర్యలు తీసుకున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 2,78,158 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,35,426, మహిళలు 1,42,688, ఇతరులు 44 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల విధుల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో అధికారుల నుండి అందే ఫిర్యాదులు, సూచనల పర్యవేక్షణకు లాడ్జి సెంటర్ లోని ఏఎల్ బిఈడి కాలేజిలో కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేశామని తెలిపారు.


ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గానికి 13న జరిగే పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిణీకి స్థానిక ఏసీ కాలేజిలో ఏర్పాట్లు పూర్తి చేశామని నగర కమిషనర్, ఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన పోలింగ్ మెటీరియల్‌ను ఆదివారం ఉదయం 7 గంటల నుండే పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర కమిషనర్ శనివారం ఏసి కాలేజిలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది పిఓలు, ఏపిఓలు ఉదయం 7 గంటలకే ఏసి కాలేజిలో రిపోర్ట్ చేయాలన్నారు. తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను 22 సెక్టార్లుగా విభజించి, ప్రత్యేకంగా అధికారులను కేటాయించామన్నారు. సెక్టార్ వారీగా టేబుల్స్, మెటీరియల్ ప్యాకింగ్‌కు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పిఓలు రిపోర్ట్ చేసిన వెంటనే వారికి పిడిఎంఎస్ యాప్ డౌన్‌లోడ్, లాగిన్ చేయడం, అటెండెన్స్ కోసం సిబ్బందిని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

వంద శాతం ఓటింగ్‌తోనే ప్రజాస్వామ్యం బలోపేతం

ఓటర్లను చైతన్య పరుస్తున్న లెట్స్ ఓట్ సభ్యులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో ఓటింగ్ 100 శాతం పెరిగేందుకు యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు వేయాలని 'లెట్స్ ఓట్' ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య పేర్కొన్నారు. గత 40 రోజులుగా ఓటర్లలో చైతన్యానికి అనేక కార్యక్రమాలు చేస్తున్న లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో చివరి కార్యక్రమంగా శనివారం ఉదయం స్థానిక బ్రాడీపేట అంబేద్కర్ కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఫస్ట్ ఓటర్స్ విద్యార్థులు, యువతీ యువకులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఓటు ప్రాధాన్యత తెలియజేసే టిషర్ట్స్, టోపీలు జాతీయ, లెట్స్ ఓట్ పతాకాలు చేపట్టి పాదచారులకు అవగాహన కల్పించారు. లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ టి. బాలాజీశ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు కె.వి భాస్కర్, సీతారమేష్, వల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.


ఓటర్ల చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్న లెట్స్ ఓట్ సభ్యులు



గుంటూరు అమరావతి రోడ్డు నగరాల బాలాజీ నగర్ 2వ లైన్‌లో ఒక ఇంటికి పెట్టిన బోర్డులు ఓటర్లను ఆలోచింప చేసేవిగా ఉన్నాయి.

సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సాధరణ ఎన్నికలకు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అధర్ పోలింగ్ అధికారులుగా నియమించబడిన ఉద్యోగులను పోలింగ్ కేంద్రాల కేటాయింపునకు శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గముల ఎన్నికల పరిశీలకులు నీరజ్ కుమార్ , తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కార్తీకా, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని)పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను జనరేట్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 1915 పోలింగ్ కేంద్రాలలో రిజర్వు సిబ్బందితో కలిపి పీవోలుగా 2300 మంది, ఏపీవోలుగా 2300 మంది, ఓపిఓలుగా 9200 మంది మొత్తం 13,800 మంది ఉద్యోగులకు గతంలో కేటాయించిన నియోజకవర్గాల్లో విధులు నిర్వహించాల్సిన పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెద్ది రోజా, ఎన్నికల మ్యాన్ పవర్ నోడల్ అధికారి శైలజ, ఐటీ నోడల్ అధికారి రఘు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఏఈఆర్వో బీమారావు పాల్గొన్నారు.


పోర్టల్ ద్వారా సిబ్బంది కేటాయింపును పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13 జరగనున్న పోలింగ్‌కు గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని నగర కమిషనర్, నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కీర్తి చేకూరి తెలిపారు. ఓటర్లు పోలింగ్ రోజుని సెలవురోజులా కాకుండా ఓటు వేయడానికి ప్రత్యేక రోజుగా పరిగణించి తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని కోరారు. బిఎల్ఓల ద్వారా ఓటర్ స్లిప్‌ల పంపిణీ చేయడం జరిగిందని, పోలింగ్ రోజు ఓటరు గుర్తింపు కార్డు తీసురావాలని, ఓటర్ గుర్తింపు కార్డు లేకుంటే పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ గుర్తింపు కార్డ్, ఫొటో ఉన్న బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, పాన్ కార్డ్, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్.పి.ఆర్.) పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్.జి.ఐ.) జారీ చేసిన స్మార్ట్ కార్డ్, ఉపాధి హామీ గుర్తింపు కార్డ్, కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్, ఫొటో ఉన్న పెన్షన్ కార్డ్, ప్రజా ప్రతినిధులకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డ్, ఆధార్ కార్డ్ వంటి 11 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ అధికారు లకు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చుని తెలిపారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఏసమస్య లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేశామని, వికలాంగుల కోసం ర్యాంప్‌లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, టాయ్‌లెట్స్, లైటింగ్, టెంట్‌లు, కుర్చీలు వంటి మౌలిక వసతులను సంబంధిత ప్రాంత ఏఈలు పూర్తి చేశారని కమిషనర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, 200 మీటర్ల దూరంలోపు పార్టీల కార్యాలయాలు ఉండకూడదన్నారు. తూర్పు నియోజకవర్గంలోని మొత్తం 255 పోలింగ్ కేంద్రాల్లో 234 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ జరుగుతుందని, అందుకు తగిన సిసి కెమెరాలు ఏర్పాట్లు సంబందిత ఏఈలు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. తూర్పు నియోజకవర్గంలో 2,50, 691 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,21,849, మహిళలు 1,28,808, ఇతరులు 34 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల విధుల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో అధికారుల నుండి అందే ఫిర్యాదులు, సూచనల పర్యవేక్షణకు జిఎంసి ప్రదాన కార్యాలయంలో రిపోర్టింగ్ టీం, స్పెషల్ కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ సమయంలో ఏ సమస్య ఎదురైనా పరిష్కారానికి క్విక్ రియాక్షన్ టీం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రత్తిపాడులో సిపిఐ పార్లమెంట్ అభ్యర్థి జంగాల రోడ్ షో

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో ఇండియా వేదిక బపలర్చిన గుంటూరు ఎంపీ స్థానం సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌శనివారం రోడ్ షో చేశారు స్థానిక సిపిఐ కార్యాలయం నుంచి అంకమ్మ గుడి సెంటర్ పీర్ల చావిడి సెంటర్ ముస్లిం ఏరియాలో భారీ రోడ్ షో సాగింది. బస్టాండ్ సెంటర్లో అభ్యర్థి మాట్లాడుతూ గుంటూరు పార్లమెంటు పరిధిలో ఎన్డీఏ కూటమిని ఓడించి తనను గెలిపించాలని కోరారు. మోడీ అహంకారపూరిత మీద దెబ్బ కొట్టాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏఐటీయూ సి జిల్లా అధ్యక్షుడు మేడ హనుమంతరావు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్ జి ప్రత్తిపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు సహాయ కార్యదర్శి ఎస్ వీరాంజనేయులు సిపిఐ మండల కార్యదర్శి మామిడి అంకమ్మరావు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు సిద్ధిరవి ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కుంచాల అంకమ్మరావు సహాయ కార్యదర్శి గోపిరెడ్డి నాగిరెడ్డి రైతు సంఘాలు నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ అమరలింగేశ్వర రావు వీరా రావు వెంకట్రావు నియోజకవర్గ మహిళా కార్యదర్శి రమాదేవి పలువురు మహిళా నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం - సంయమనంతో ముందుకెళదాం

పోలింగ్ కేంద్రం, కన్వీనర్లు, ఏజెంట్లతో విడదల రజిని భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


సమావేశంలో మాట్లాడుతున్న రజిని

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలని బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని సూచించారు. స్థానిక గుంటూరు ఏ 1 కన్వెన్షన్‌లో శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బూత్ కన్వీనర్లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంయమనంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. టిడిపి దొంగ ఓట్లతో చెలరేగే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ పన్నాగలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే, పేదలు ఆర్థికంగా మరింతగా నిలదొక్కుకోవాలంటే వైసిపి మళ్లీ గెలవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అలజడులు సృష్టించాలని టిడిపి ప్రయత్నిం చే అవకాశాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితి తలెత్తితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. క్షణాల్లో ఆయా బూత్ ల వద్దకు వచ్చేస్తామన్నారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ తన పరిపాలన వలన మేలు జరిగింది అని అనుకుంటేనే ఓటేయండి అని అడిగిన దమ్మున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అని చెప్పారు. జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబునాయుడు కూటమి కట్టాడని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ ఏసు రత్నం మాట్లాడుతూ ల్యాండ్ టిటిలింగ్ యాక్ట్ పై చంద్రబాబునాయుడు, ఎల్లో బ్యాచ్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. ఓట్ల కోసం చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలు ఇస్తుంటే ప్రజల కోసం జగనన్న అమలు చేయగల హామీలే ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పై చిత్తశుద్ధి ఉన్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మద్దాలి గిరి తెలిపారు. అందుకే తాను చేయగల అహామీలను మాత్రమే జగనన్న ఇచ్చారని చెప్పారు. వైసిపి నాయకులు టీవీ రావు, చందు సాంబశివరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు తదివతరులు పాల్గొన్నారు.